క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



చెత్త సేకరణను తనిఖీ చేస్తున్న రమాదేవి

వీరపునాయునిపల్లె: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యంగా జీవించవచ్చని పులివెందుల డివిజనల్ పంచాయతి అధికారి రమాదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో చెత్త సేకరణను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లాప్ మిత్రలు ప్రతి రోజు ప్రతి గడప వద్దకు వెళ్లి తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా సేకరించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణ నిరంతరాయంగా కొనసాగాలని పేర్కొన్నారు. చెత్త సేకరణ కొరకు గతంలో అందజేసిన సైకిళ్లు పాడవడంతో 15వ ఫైనాన్స్ నిధుల ద్వారా ఒక్కో ట్రై సైకిల్ 35వేల రూపాయలతో రెండు సైకిళ్లు కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ పులిరామ్ సింగ్, పంచాయతీ కార్యదర్శి నాగభూషణ్‌రెడ్డి, పీఆర్‌సీ రీసోర్స్ పర్సన్ దేవేంద్రారెడ్డి, ఉప సర్పంచ్ రవీంద్రనాథ్‌రెడ్డి, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలి



ఎంపీడీఓ చంద్రమౌలీశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచాయితీ కార్యదర్శులు

వీరపునాయునిపల్లె: పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి కోరారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులతో కలసి ఆయన మండల అభివృద్ధి అధికారి చంద్రమౌలీశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పెంచడంతో ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. కనీసం సెలవు దినాల్లో కూడా కుటుంబ సభ్యులతో గడిపేందుకు కూడా సమయం దొరకడం లేదని పేర్కొన్నారు. కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతి కార్యదర్శులు పాల్గొన్నారు.

రంజాన్ మాసం ఎంతో పవిత్రం



వైఎస్ భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న ముస్లిం నాయకులు

పులివెందుల రూరల్: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ముస్లింలు ఎంతో నిష్ఠతో నెలంతా దీక్షలు చేస్తారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఉన్న భాస్కర్‌రెడ్డిని సోమవారం ముస్లిం మైనార్టీ నాయకులు, వైఎస్సార్‌సీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రంజాన్ పండుగను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం పులివెందుల పరిస్థితులతోపాటు పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ రాయల్ బాబు, సంసార్ అత్తార్ పాల్గొన్నారు.

ఘనంగా గుంటి లక్ష్మణ స్వామి ఆరాధన



గుంటి లక్ష్మణస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

లింగాల : మండలంలోని కర్ణపాపాయపల్లె గ్రామ సమీపంలోని భూలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం గుంటి లక్ష్మణ స్వామి 16వ ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. గుంటి లక్ష్మణస్వామి విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆరాధన సందర్భంగా భాగవత పఠనం, రామ భజనలు, కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. అదేవిధంగా రాత్రి పౌరాణిక నాటక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

వీరపునాయునిపల్లె: వీరపునాయునిపల్లె మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని సోమవారం మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగభూషణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రమేష్ బాబు, మహిళా విభాగం అధ్యక్షురాలుగా మస్తాని, కోశాధికారి రాజేష్, జనరల్ సెక్రటరీగా నరేంద్ర, జాయింట్ సెక్రటరీగా పవన్ కుమార్ రెడ్డి, గౌరవ సలహాదారుడిగా లక్ష్మి కాంత్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ప్రసాద్, నవీన్ బాషా, హరికృష్ణ, విజయ్‌భాస్కర్, శివ చంద్రికను ఎన్నుకున్నారు.

కుక్కల బెడద.. నిత్యం వ్యథ

ఒకప్పుడు వీధి కుక్కలంటే ఆ వాడకు రక్షణగా ఉండేవి. ఎవరైనా అపరిచితులు వచ్చినా, రాత్రిపూట ఆగంతకులు చొరబడినా పసిగట్టి మొరుగుతూ ప్రజలను అప్రమత్తం చేసేవి. కానీ, ఇప్పుడు అవే కుక్కలు ప్రజలు, పసిపిల్లల పాలిట మృత్యు మృగాలుగా మారాయి. కాలనీలోని కిరాణా షాపునకు వెళ్లాలంటే భయం. రోడ్డుపై నడవాలంటే ఆందోళన! నిత్యం వెళ్లే ప్రాంతమైనా అప్రమత్తంగా ఉండాల్సిందే. రాత్రి వేళ అయితే పరిస్థితి మరింత భయానకం. పులివెందుల పట్టణం, గ్రామాల్లో ఇలా కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఏ కుక్క కరిచినా ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిందే. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం. వీటి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

- దడ పుట్టిస్తున్న గ్రామ సింహాలు
- రోడ్లపై గుంపులు గుంపులుగా సంచారం
- హడలెత్తిపోతున్న గ్రామీణ ప్రాంత ప్రజలు
- పెరుగుతున్న కుక్క కాటు బాధితులు



పులివెందులలో రోడ్లపై తిరుగుతున్న కుక్కలు

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా వీధి కుక్కలు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. కుక్కల నియంత్రణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఏ వీధిలో చూసినా, ఏ గ్రామంలో చూసినా కుక్కలు గుంపులుగుంపులుగా సంచరిస్తూ హడలెత్తిస్తున్నాయి. రాత్రి సమయాల్లో వాహనదారులను శునకాలు వెంటపడుతూ భయపెడుతున్నాయి. కుక్కల నుంచి రక్షించుకునే ప్రయత్నంలో ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణంలోని వీధుల్లో కూడా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామాల్లోనూ, మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకు కుక్కల సంతతి పెరుగుతోంది. రోడ్లపై ఒంటరిగా తిరగాలంటే భయమేస్తోందని ప్రజలు వాపోతున్నారు. వారం రోజుల క్రితం పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సమీపంలో కుక్కలు స్వైర విహారం చేస్తూ చిన్న పిల్లాడిని తలను కొరుతున్న దృశ్యాన్ని స్థానికులు చూసి వాటిని అదలించి పిల్లాడిని రక్షించారు. లేకపోతే కుక్కల దాడిలో పసి బాలుడు ప్రాణాలు పోయేవి.

నియంత్రణకు చర్యలు శూన్యం

పులివెందుల పట్టణంలో పాటు గ్రామాల్లోనూ కుక్కల నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో కుక్కల సంతతి పెరిగిపోతోంది. రాత్రి సమయాలలో ప్రజలు బయటికి రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఏ వీధిలో చూసినా కుక్కలు బెడద ఎక్కువైంది. వాహనాల్లో వెళ్తున్న వారిని కుక్కలు తరుముతున్నాయి. వెంట పడుతుండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కుక్కల బెడద లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రఘురాముడు, స్థానికుడు, పులివెందుల

కుక్కలు వెంబడిస్తున్నాయి



రోడ్డుపై ద్విచక్ర వాహనాల్లో వెళుతుంటే కుక్కలు వెంబడిస్తున్నాయి. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా ఉన్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులను సైతం వెంబడిస్తుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు.

– రాము, స్థానికుడు, పులివెందుల

ఆర్టీసీ బస్టాండు ప్రారంభించేదెప్పుడు?

వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వేంపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.2.20 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన ఆర్టీసీ బస్టాండును ఎప్పుడు ప్రారంభిస్తారని వేంపల్లె వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చంద్రఓబుళరెడ్డి, ఉపాధ్యక్షుడు మునీర్ బాషా, రవిశంకర్ గౌడ్ ప్రశ్నించారు. సోమవారం స్థానిక గండి రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులు 90శాతం పూర్తయ్యాయని, తర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడి 10శాతం పనులు పూర్తి చేసిందని తెలిపారు. నిర్మాణ పనులు పూర్తయి 5 నెలలు దాటినా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ముఖ్యంగా ప్రజలు, ప్రయాణీకులు, మహిళలు, మహిళా కండక్టర్లు మల, మూత్ర విసర్జనకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అంతేకాకుండా రైతులు పండించిన పంటలను నేరుగా అమ్ముకునేందుకు గత ప్రభుత్వం రూ.1.20 కోట్ల వ్యయంతో రైతు బజార్‌ను నిర్మించి ప్రారంభించడం జరిగిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురాకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వేంపల్లె మండలంలో సుమారు రూ.600 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, వైఎస్సార్ మెమోరియల్ పార్కు, ఉర్దూ జూనియర్ కళాశాల, తదితర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రధాన రోడ్లు, సెంటర్ లైటింగ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ తదితర అభివృద్ధి పనులు ఆగిపోయాయని, తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడి 10నెలలు గడుస్తున్నా ఆధిపత్య పోరుతో పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి కటిక చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, మండల కార్యదర్శులు కమతం రాజా, పోలేపల్లి గణేష్, సునీల్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ నీలమయ్య

కమలాపురం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయడంపై దృష్టి పెట్టాలని కమలాపురం ఈఆర్‌ఓ నీలమయ్య సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకుల సహకారంతో తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేస్తామన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. ప్రతి ఓటు కార్డును ఆధార్‌తో లింక్ చేయాలని పేర్కొన్నారు. వివాహితులైన వారివి, గ్రామాల్లో లేని వారివి, మృతి చెందిన వారి ఓట్లను తొలగించాలన్నారు. తాము రూపొందించిన ఓటరు జాబితా ఆధారంగా స్థానిక సంస్థలకు వార్డు వైజ్ డివైడ్ చేసేదానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల తహసీల్దార్లు శివరామిరెడ్డి, సరస్వతి, లక్ష్మీదేవి, లక్ష్మమ్మ, నాగేశ్వరరావు, డీటీ అహల్య పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించి నీటిని అందిస్తున్న ఎస్ఐ పెద్ద ఓబన్న

తొండూరు : మండల కేంద్రమైన తొండూరు గురుకుల పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఎస్ఐ పెద్ద ఓబన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఈ చలివేంద్రాన్ని పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవి కాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఎస్ఐ పెద్ద ఓబన్నకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

వల్లూరు: మండల కేంద్రమైన వల్లూరులోని శివాలయం దగ్గర గల నాలుగు రోడ్ల కూడలిలో రేపటి మార్పు కోసం మనందరం కృషి చేస్తాం సంస్థ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ప్రారంభించిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ స్థానిక హైస్కూల్‌లో టెన్త్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులతోపాటు బాటసారుల దాహార్తిని తీర్చడం కోసం రేపటి మార్పు కోసం మనందరం కృషి చేస్తాం సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సంస్థ అధ్యక్షులు ఆంజనేయులు, సంస్థ సభ్యులు హరి, వెంకట కుమార్, సుబ్బరాయుడు, దూద్‌పీర్, రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం ఆహార ఉత్పత్తులతోనే ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న రైతులు

జమ్మలమడుగు: ప్రకృతి సేద్యంతో పండించిన ఆహార ఉత్పత్తు లతోనే ఆరోగ్యకరమని వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటల స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం మండల పరిధిలోని గడెంచెరువు, పెద్దదండ్లూరు, సిరిగేపల్లి, సున్నపురాళ్లపల్లె ఎస్.ఉప్పలపాడు గ్రామంలో ఆకు కూరలు, కూరగాయాలు పండిస్తున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వార పండించిన పంటలకు ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి, ఐసీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌డబ్ల్యూఓపై చర్యలు తీసుకోవాలి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న శివకుమార్

జమ్మలమడుగు: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జమ్మలమడుగు ఏఎస్‌డబ్ల్యూఓ గురుప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కడప కలెక్టరేట్‌లో ఏఎస్‌డబ్ల్యూఓపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉండాల్సిన ఏఎస్‌డబ్ల్యూఓ పులివెందుల ఉంటూ వసతి గృహాలను పరిశీలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆయనను సస్పెండ్ చేయాలని, ఎస్సీ వసతి గృహంలో మరణించిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

ఆరవేటిపల్లెలో నీటి కష్టాలు



నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు

ముద్దనూరు: మండలంలోని ఆరవేటిపల్లె గ్రామ ప్రజల నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. కొద్దిరోజులుగా గ్రామంలో తాగునీటి కొరత ఏర్పడింది. భూగర్భజలాలు తగ్గుముఖం పట్టాయని గ్రామస్తులు తెలిపారు. తాగునీటితో పాటు రైతులకు సాగునీటి కష్టాలు కూడా మొదలయ్యాయి. గ్రామంలో ప్రధానంగా అరటి, చీనీ, బొప్పాయితోపాటు కూరగాయల సాగు అధికంగా ఉంది. సాగుకు నీరు సరిపడా లేకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తూ పంటలను కాపాడుకుంటున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



అరటిచెట్లకు ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తున్న రైతులు

మల్లేశ్వరస్వామి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే



మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి: పెండ్లిమర్రి మండలం పొలతల శైవ క్షేత్రంలోని శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానంలోని మల్లేశ్వరస్వామి, పార్వతీదేవి అమ్మవార్లను సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పొలతల మాజీ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ రమణారెడ్డి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు నాగమల్లారెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి

జమ్మలమడుగు: పట్టణంలోని పేదలకు పక్కా గృహాలు దక్కకుండా స్థానిక తహసీల్దార్ శ్రీనివాసుల రెడ్డి కుట్ర చేస్తున్నారని మాజీ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మేకల ఆంజనేయులు ఆరోపించారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఇంటి అనుబంధ పత్రాలను ఇవ్వకపోవడంతో అర్హత ఉండి కూడ ఇళ్లు మంజూరు కావడం లేదని తెలిపారు. రాకుండపోతున్నాయన్నారు. అంతేకాకుండ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదనంగా 50వేల నుంచి లక్ష రూపాయల వరకు ఎస్సీ, ఎస్టీలకు ప్రోత్సహకాలు ఇస్తుంటే ఇందుకు భిన్నంగా తహసీల్దార్ శ్రీనివాసుల రెడ్డి అనుబంధపత్రాలు ఇవ్వకుండ నిర్లక్ష్యం చేయడం కారణంగా దాదాపు 50 మంది సొంతింటి కల నెరవేరకుండాపోతుందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన తహసీల్దార్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

గృహ నిర్మాణాలకు అదనపు సాయం

వీరపునాయునిపల్లె: పీఎం, ఏవై, ఎన్,టి,ఆర్ పథకం ద్వారా ఇళ్లు మంజూరై అసంపూర్తి గృహ నిర్మాణదారులకు ప్రభుత్వం అదనపు సహాయం అందిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రమౌలీశ్వర్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ సభా భవనంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణదారులకు ఇస్తున్న రూ. 1.80 వేలకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ. 75వేల రూపాయలు అదనంగా అందించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ప్రతాప్‌రెడ్డి, ఏఈ సురేష్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పది పరీక్ష.. తొలిరోజు ప్రశాంతం



పులివెందుల టౌన్ : పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



వేంపల్లె : పరీక్షా కేంద్రం వద్ద తల్లిదండ్రులతో విద్యార్థులు



సింహాద్రిపురం: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



కమలాపురం: గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

సింహాద్రిపురం : మండలంలో సోమవారం ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పదో తరగతి పరీక్షలను రెండు కేంద్రాల్లో ఏర్పాటు చేశామని ఎంఈఓ ఓబులేసు తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన సింహాద్రిపురం ఎంఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. ఇద్దరు గైర్హాజరయ్యారని తెలిపారు. అలాగే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 100మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, ఒకరు మాత్రమే గైర్హాజరయ్యారన్నారు. ఈ పరీక్షా కేంద్రాలకు ఎగ్జామినేషన్ చీఫ్ అధికారులుగా సతీష్ ప్రభు, నాగార్జున వ్యవరించారని పేర్కొన్నారు.

లింగాల : మండల కేంద్రమైన లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. సోమవారం 215 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 213మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఎంఈఓ రామకృష్ణుడు తెలిపారు.

కమలాపురంలో..

కమలాపురం: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం కమలాపురం పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు టెన్త్ పరీక్షలు సజావుగా సాగాయి. జెడ్పీ బాయ్స్, జెడ్పీ గర్ల్స్ హైస్కూల్స్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ బేబి తెలిపారు. మొత్తం ఐదు పరీక్షా కేంద్రాల్లో 518 మంది విద్యార్థులకు గాను 514 మంది హాజరయ్యారని ఆమె వివరించారు. కాగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ఎస్ఐ ప్రతాప్ రెడ్డి సిబ్బందితో 144 సెక్షన్ అమలు చేశారు.

ప్రారంభమైన పరీక్షలు

పులివెందుల టౌన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. పులివెందుల పట్టణంలోని 10సెంటర్లలో 1,666 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని ఎంఈఓ చంద్రశేఖర రావు తెలిపారు. పట్టణంలోని అంకాలమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సత్రంబడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1, 2, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, సెయింటాన్స్, నలంద, నారాయణ, వివేకానంద, వెంకటప్ప మోమోరియల్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వేంపల్లెలో..

వేంపల్లె : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. వేంపల్లె గ్రామంలోని రెండు పాఠశాలలో నాలుగు సెంటర్లు ఉండగా 1,033 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. 1,033 మంది విద్యార్థులకు గాను 1031 మంది విద్యార్థులు హాజరు కాగా.. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఓ జాఫర్ సాదిక్ తెలిపారు. బాలుర పాఠశాలలోని ఏ. సెంటర్ లో 260 మందికి 259 విద్యార్థులు హాజరయ్యారు. బి. సెంటర్ లో 254కు 254 మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే బాలికల ఏ. సెంటర్ లో 259కి 259 మంది విద్యార్థులు హాజరు కాగా బి. సెంటర్ లో 260కి 259 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఇఓ తెలిపారు.

ముద్దనూరు: స్థానికంగా పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రోటరీ క్లబ్ తరుపున చల్లని తాగునీటి అందిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. కూలింగ్ క్యాన్లను ఏర్పాటు చేసి చల్లటి తాగునీటిని అందిస్తున్నట్లు ఎంఈఓ నాగేశ్వరరావు నాయక్, ఏఓలు తెలిపారు.

వేములలో..

వేముల : మండల కేంద్రమైన వేములలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షా కేంద్రాల్లో 286 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరయ్యారు. మండలంలోని వేముల ఉన్నత పాఠశాల, కేజీబీవీ, గొల్లలగూడూరు ఉన్నత పాఠశాల, నల్లచెరువుపల్లె ఉన్నత పాఠశాల, చాగలేరు ఉన్నత పాఠశాల, వి.కొత్తపల్లె ఉన్నత పాఠశాలల్లో, సెవెంత్‌డే హైస్కూలు, తాళ్లపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు రెండు సెంటర్లలో పరీక్షలు రాశారు.

వల్లూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 99 మంది విద్యార్థులకు 99 మంది, గంగాయపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 210 మంది విద్యార్థులకు 210 మంది హాజరయ్యారు. కమలాపురం సీఐ ఎస్కే రోషన్ పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును పర్యవేక్షించారు.

జమ్మలమడుగు: పదో తరగతి పరీక్షలు సోమవారం తెలుగు పరీక్షతో ప్రారంభమయ్యాయి. మొత్తం పట్టణంలో 10 పరీక్ష కేంద్రాలలో మొత్తం 1,507 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. అయితే తెలుగు పరీక్ష రోజున జాన్స్ హైస్కూల్‌లో 161మందికి 161, టీకేఆర్ హైస్కూల్100కు వందమంది పీఆర్ హైస్కూల్‌లో 220 మందికి 220 విద్యార్థులు హాజరయ్యారు. గీతాంజలి ఉన్నత పాఠశాలలో ఐదుగురు గైర్హాజరయ్యారు.

విలువలతో కూడిన విద్య అవసరం

వేంపల్లె : నేటి సమాజానికి విలువలతో కూడిన విద్య అవసరమని మహిళా ఎంట్రప్రెన్యూర్ రమీజా, సుష్మా పేర్కొన్నారు. సోమవారం స్థానిక అక్షర కళాశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు తమ కాళ్ల మీద నిలబడటానికి క్రమశిక్షణతో కూడిన విద్య చాలా అవసరమవుతుందన్నారు. అమ్మాయిలకు ప్రత్యేకంగా కళాశాలను స్థాపించడం వలన గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ విజయభారతి మాట్లాడుతూ చదువులతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ అత్యధిక పథకాలు సాధిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పలువురు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

డంపింగ్ యార్డుకు స్థలం చూపండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల నగర పంచాయతీకి డంపింగ్ యార్డు స్థలం సేకరణకు పరిష్కారం చూపాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ శోభన్‌బాబు సీపీఐ నాయకులు వినతి పత్రం అందించారు. ఐసీఎల్ ప్రహరీ, వంక మధ్యలో ప్రభుత్వ బంజరు భూమి ఉందని దాన్ని డంపింగ్ యార్డుకు ఉపయోగించాలని వారు కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు పాల్గొన్నారు